క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



చన్నపల్లప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బ్రహ్మసముద్రం: ఎస్.కోనాపురం గ్రామానికి చెందిన గట్టపర్తి చన్నమల్లప్ప(59) అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్, మాజీ ఎంపీపీ మహదేవప్ప, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి మంజునాథ, నాయకులు వడ్డే వెంకటేశులు, వెంకి, తిప్పారెడ్డి తదితరులు చన్నమల్లప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

13న జాతీయ లోక్ అదాలత్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జడ్జి కె.భాను తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు జరిగే లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, సివిల్, కోర్టులో పెండింగ్‌లో ఉన్నవి, పెండింగ్ లేని సమస్యల పరిష్కారానికి స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ వకీలు ద్వారా గాని లేదా నేరుగా కాని మండల న్యాయ సేవా సమితి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.

మాతా శిశు మరణాలు అరికట్టాలన్నదే లక్ష్యం



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి ఉషారాణి

కూడేరు: మాతా శిశు మరణాలను అరికట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండల వైద్యాధికారిణి ఉషారాణి అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులు ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా జాగ్రతలు తీసుకోవాలన్నారు. లేదంటే ప్రసవం కష్టతరమై మాతాశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

అరటి పంట సాగుకు 30 శాతం సబ్సిడీ

కూడేరు: ఎస్సీ, ఎస్టీ రైతులు అరటి పంట సాగుకు 30 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించనుందని నియోజక వర్గ హార్టికల్చర్ ఆఫీసర్ యామిని, ఎంపీఈఓ జాస్మిన్ బుధవారం తెలిపారు. రెండున్నర ఎకరాలో 4 వేల అరటి మొక్కలను సాగు చేసుకోవాలన్నారు. సాగైన రెండు నెలలకు హార్టికల్చర్ ఆఫీస్ లేదా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే తొలి ఏడాది అరటి పెంపకానికి రూ.42 వేలు. రెండో ఏడాది రూ.20 వేలు ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ప్రయాణికులకు 'సూపర్' కష్టాలు



ఆర్టీసీ బస్సులు లేక వెలవెలబోయిన పాత బస్టాండ్



బస్సుల లేక ప్రయాణికుల అవస్థలు



బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

రాయదుర్గంటౌన్: అనంతపురం జిల్లా కేంద్రం నిర్వహించిన సీఎం సభతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సులన్నీ అనంతపురానికి తరలించడంతో ముఖ్యంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. రాయదుర్గం పట్టణంలోని పాత బస్టాండ్, బళ్లారికి వెళ్లే బస్టాండ్‌లో బుధవారం ఒక్క బస్సు కూడా కనిపించలేదు. ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 56 బస్సులుండగా వీటిలో దాదాపు 38 బస్సులను అనంతపురంలో జరిగిన ముఖ్యమంత్రి సూపర్‌హిట్ సభకు కేటాయించడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. బస్సులు లేకపోవడం వివిధ పనుల నిమిత్తం అనంతపురం, బళ్లారి, కణేకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గంకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడ్డారు. అనంతపురం రూట్‌లో కేవలం 5 బస్సులు మాత్రమే నడపడంతో బస్సులు కోసం గంటల తరబడి బస్టాండ్లలోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు ప్రయాణాలను రద్దు చేసుకుని వెనుదిరిగారు. ఈ క్రమంలో ఆటోలను ఆశ్రయించి అవస్థలు పడ్డారు. బస్సులు సక్రమంగా నడపకపోవడంతో మీటింగ్‌ల పేరుతో ప్రజా రవాణకు ఇబ్బందులకు కలిగించడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి వ్యక్తం చేశారు.

బాబుది సుపరిపాలన కాదు.. మోసాల పాలన

- మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప



కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ నేతలు

రాయదుర్గంటౌన్: ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలు అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేస్తున్నారో ప్రజలు గమనించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 21, 24 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, వార్డు ఇన్‌చార్జులు పైతోట రఘు, మాజీ కౌన్సిలర్ రఘురాం, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి చంద్రబాబు మోసపూరిత పాలనను ప్రజలకు వివరించారు. చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ చంద్రబాబుది సుపరిపాలన కాదని.. మోసాల పాలన అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలతో లబ్ధిచేకూర్చారన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు.

ఆడబిడ్డ నిధి ఏమైంది?

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడిచినా ఏ పథకాన్ని సరిగ్గా అమలు చేయడంలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప విమర్శించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణమని కేవలం నాలుగైదు సర్వీసుల్లోనే పరిమితి చేయడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ. 3 వేల భృతి ఏమైందని ప్రశ్నించారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, పింఛన్‌లు మంజూరు పట్టించుకునే దిక్కులేదన్నారు. వలంటీర్లు, రేషన్ వాహనాలను తొలగించి ఇంటి వద్ద సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శారదాదేవి, గౌని లావణ్య, పొరాళ్ల గోవిందరాజులు, ఫకృద్దీన్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బషీర్ అహ్మద్, వార్డు ఇన్‌చార్జ్ గౌని శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, రామాంజనేయులు, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, కొలిమి ఆనంద్, బడిగే బషీర్, చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ అల్తాఫ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయమా.. కంపోస్టు యార్డా!



ఎంపీడీఓ కార్యాలయం ముందు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

కూడేరు: ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనం మారుమూల గ్రామంలో పాతబడిన ప్రభుత్వ కార్యాలయ భవనం అనుకుంటే పొరపాటేనండోయ్. ఇది మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం. కార్యాలయ భవనం ముందే చెత్తాచెదారం పడేశారు. పక్కన పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో శనివారం ఎంపీడీఓ ,డిప్యూటీ ఎంపీడీఓలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారాన్ని ఇళ్లముందు , వీధుల్లో వేయొద్దని ప్రజలకు ఉపన్యాసం ఇస్తారు. కానీ సొంత భవనం ముందు మాత్రం పరిశుభ్రతను పాటించడం లేదు. ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి పోయి పాములు సంచరిస్తున్నాయి. పలుమార్లు పాములు సిబ్బంది, ప్రజలు పక్కన వెళ్లడంతో భయాందోళన చెందుతున్నారు. ఇక్కడి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను చూసి ప్రజలు అధికారులు పరిశుభ్రత పాటించరా?అని గుసగుసలాడుకుంటున్నారు.

మూడు గంటలకే మూతపడిన సచివాలయం



మూతపడిన రాగులపాడు గ్రామ సచివాలయం

వజ్రకరూరు: రాగులపాడు గ్రామంలోని గ్రామ సచివాలయం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకే మూతపడింది. సచివాలయంలో గ్రామ కార్యదర్శితో పాటు సుమారు 8 మంది సచివాలయ ఉద్యోగులు పని చేస్తున్నారు. సచివాలయం ఉద్యోగులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరుకు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇక్కడ మధ్యాహ్నం మూడు గంటలకే ఏ ఒక్క అధికారి అందుబాటులో లేకుండా తాళాలు వేసి వెళ్లి పోయారు. స్థానికుతో పాటు చుట్టు పక్కల నుండి వచ్చిన ప్రజలు కార్యాలయానికి వచ్చి తాళం వేసి ఉన్న సచివాలయాన్ని చూసి నిరాశతో వెనుదిరిగారు.

రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో ప్రతిభ



కామక్కపల్లి రవీంద్ర

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురంలోని కృష్ణకళా మందిర్‌లో ఈ నెల ఐదో తేదీ నుంచి నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన రవీంద్ర ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి పొందాడు. ఈ సందర్భంగా అచ్చంట బాలాజీ నాయుడు, తెనాలి సుబ్రమణ్యం రెవెన్యూ ఆఫీసర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా బేబీ ప్రియాంక



నామాల బేబీ ప్రియాంక

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన నామాల బేబీ ప్రియాంక నియమితురాలైంది. ఈ మేరకు అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనను నియమించిన అధినేత వైఎస్ జగన్‌కు, సహకరించిన జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు మాదినేని ఉమా మహేశ్వరనాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టత కోసం తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

వజ్రకరూరు పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న స్వస్తి బృందం సభ్యులు

ఉరవకొండ(వజ్రకరూరు): స్థానిక పీహెచ్‌సీని స్వస్తి బృందం సభ్యులు తనిఖీ చేసింది. ప్రోగ్రాం స్టేట్ మేనేజర్ డాక్టర్ తన్మయి, మేనేజర్ వేదిక, అసోసియేట్ మేనేజర్ ఇవాన సిబ్బందితో మాట్లాడారు. వాతావరణ మార్పులతో తలెత్తే ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ గురుప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఉరవకొండ(వజ్రకరూరు): స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాల్లో బుధవారం వజ్రకరూరు పీహెచ్‌సీ అధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సర్దార్‌వలి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం జలుబు, దగ్గు, జ్వరం లాంటి బారిన పడిన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన మందులు అందించారు. సర్పంచ్ మోనాలీసా, హెల్త్ సూపర్‌వైజర్ నాగశంకర్, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, సంపత్‌కుమార్, శ్రీలక్ష్మి, రాజేశ్వరీ పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్ పేర్కొన్నారు. ఐఈసీ ఇంటెన్సిఫైడ్ క్యాంపైన్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కరపత్రాలను పంపిణీ చేసి వ్యాధుల నివారణ, జాగ్రత్తలు, నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీటీసీ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సుఖ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి? రాకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి? క్షయవ్యాధి నిర్మూలన, మాదక ద్రవ్యాలు, చెడు వ్యాసనాల నివారణపై విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఆస్పత్రుల్లో అందే ఉచిత సేవలపై తెలియజేశారు. కార్యక్రమంలో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, , ఆస్పత్రి హెడ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

సభకు రాకపోతే పథకాలు కట్

కళ్యాణదుర్గం: అనంతపురంలో 'సూపర్ సిక్స్...సూపర్ హిట్' సభకు రాకపోతే మీకు ప్రభుత్వ పథకాలు కట్ చేస్తామని టీడీపీ నేతలు బ్లాక్‌మేల్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కంబదూరు మండలం అచ్చంపల్లిలో టీడీపీ నాయకులు చాటింపు వేయడం గమనార్హం. ఇదిలా ఉండగా సభకు రాని వారి వివరాలు సేకరించి తమకు ఇవ్వాలని యానిమేటర్, ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్లను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇక పురుషులకైతే బిరియానీ ప్యాకెట్, క్వార్టర్ మందు తప్పనిసరి. ఒక్కో పంచాయతీకి రెండు నుంచి నాలుగైదు బస్సులు ఏర్పాటు చేసి.. అందులోనే మద్యం సరఫరా చేయడం కొసమెరుపు.

భూపోరాట యోధుడికి నివాళి



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కుందుర్పి: భూపోరాటం ద్వారా జిల్లాలోని ఎంతో మంది పేదలకు భూములిప్పించిన ఘనత పీఎస్ శర్మదని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు సంజీవయ్య మండల కార్యదర్శి శివలింగప్ప తదితరులు పేర్కొన్నారు. బుధవారం కుందుర్పిలో భూపోరాట యోధుడు పీఎస్ శర్మ 23వ వర్ధంతిని సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరిదాసు, వై.గోపాల్, మాజీ ఎంపీపీ గిరిజమ్మ, తిరుపాల్, రఘువీరా, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

శర్మ ఆశయాలు కొనసాగిద్దాం

కళ్యాణదుర్గం రూరల్: స్వాతంత్ర సమరయోధుడు, సీపీఐ జిల్లా నాయకుడు దివంగత పీఎస్ శర్మ ఆశయాలను కొనసాగిద్దామని నియోజవర్గ కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం శర్మ 23వ వర్ధంతి సందర్భంగా కళ్యాణదుర్గంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల కోసం శర్మ భూపోరాటాలు చేశారని స్మరించుకున్నారు.



31, 32 వార్డుల పరిధిలో ఇలా..



వర్షం వచ్చిన ప్రతిసారి బురదమయంగా మారే దుగ్గిలమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు

దుర్గంలో అధ్వానంగా రోడ్లు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో రాయదుర్గం పురపాలక సంఘంలోని వార్డుల్లో అభివృద్ధి పకడేసింది. అక్కడక్కడా అరకొరగా తప్ప చెప్పుకోదగిన ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. కొన్ని వార్డుల్లోని అంతర్గత రహదారుల పరిస్థితి దారుణం ఉంది. ఆస్పత్రి వెనుక వైపు నుంచి కూరగాయల మార్కెట్ ఓబుళాచారీ రోడ్డు వరకు, గాంధీ సర్కిల్ నుంచి కూరగాయాల మార్కెట్ వెనుక నాలుగు రోడ్ల కూడలి వరకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. 17వ వార్డులోని దుగ్గిలమ్మ గుడికి వెళ్లే రహదారి, సిండికేట్ బ్యాంకు వెనుక, 32వ వార్డులోని బైలాంజనేయస్వామి గుడి పరిసరాలు, 9,10వ వార్డు పరిధిలోని రోడ్లు కంకరతేలి, గతుకులతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక శివారు కాలనీల్లో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. వర్షాలు వస్తే రోడ్లపై నీరు ఇంకిపోయే దాకా నిలిచి ఉండి ప్రయాణానికి వీలులేకుండా ఉంది. ప్రభుత్వం స్పందించి రోడ్లను బాగు చేయాలని, కచ్చా రోడ్లు ఉన్న చోట సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గతుకులమయమైన ఏరియా ఆస్పత్రి వెనుక రోడ్డు



నేసేపేట చౌడమ్మగుడి వెనుక వీధిలో కంకరతేలిన రహదారి

ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరించండి



సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నిర్మల, స్థానికులు

కణేకల్లు: ఆర్‌డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ తక్షణమే పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆర్‌డీటీ అభిమాన సంఘం ప్రతినిధులు దయానిధి, వెంకటేశులు, గోపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కణేకల్లులో బుధవారం ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు నిర్మలతో పాటు పలువురు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏకు మద్దతుగా ప్రజలు సంతకాలను చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద, నిరుపేద ప్రజలకు ఆర్‌డీటీ ఎన్నో సేవలను అందిస్తోందన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించకపోతే పేద ప్రజలకు సేవలు ఆగిపోతాయని చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణపై చొరవ చూపాలన్నారు.